సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం ׀ 11 ׀ జూలై ׀ 2023



పీలేరులో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు అనుమతి

పీలేరు రైల్వేస్టేషన్‌లో కొత్తగా ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు ఉత్తర్వులు అందినట్లు స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటసుబ్బారావు తెలిపారు. - 8లో



శభాష్ వలంటీర్

తప్పిపోయిన బాలుడిని వలంటీర్ హరీష్ తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. సపలువురి చేత శభాష్ అనిపించుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1110	రూ.1260
రెండోరకం	రూ.960	రూ.1090

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 700 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	463
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 93.34 కిలోలు

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో పాల్గొనండి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని యువత త్వరలో నిర్వహించే జిల్లాస్థాయి యువ ఉత్సవ్‌లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కె.మణికంఠ ఒక ప్రకటనలో కోరారు. యువ ఉత్సవ్ కార్యక్రమం భారత ప్రభుత్వం యువ జన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్థానిక సాయి ఇంజి నీరింగ్ కళాశాలలో జరుగుతుందన్నారు. యువత తమ పేర్లను ఆన్‌లైన్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. యువఉత్సవ్ నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

13న మదనపల్లెకు నితిన్‌గడ్కరీ

మదనపల్లె : కేంద్ర రోడ్డు, రవాణా హైవేస్‌శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నమయ్యజిల్లా మదనపల్లె పర్యటన ఖరారైందని బీజేపీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు డాక్టర్ ఏ.వి.సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నితిన్ గడ్కరీ ఈ నెల 13న మధ్యాహ్నం 1.20 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 2గంటలకు బీటీ కళాశాల గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నక్కలదిన్నె పొన్నూటిపాళ్యం రోడ్డులోని సత్సంగ్ ఫౌండేషన్‌కు చేరుకుంటారు. సత్సంగ్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ ముంతాజ్‌అలీ(శ్రీఎం) ఆధ్వర్యంలో నిర్మించిన స్వస్థ్య ఆస్పత్రిని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు తిరిగి బీటీ కళాశాల గ్రౌండ్స్ హెలిప్యాడ్‌కు చేరుకుని సాయంత్రం 4.10 గంటలకు తిరుపతికి చేరుకుని ప్రత్యేక విమానంలో నాగ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌కు వెళతారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 67 ఫిర్యాదులను స్వీకరించారు. వీటి పరిష్కారంపై చొరవ చూపాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, ఆర్థికపరమైన నేరాలు, ఆస్తి తగాదాలు మరియు ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు అధికంగా అందాయని ఎస్పీ తెలిపారు.

ఏఎఫ్‌యూలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం



విద్యార్థినికి ప్రవేశ ప్రత్నం ఇస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఏఎఫ్‌యూ : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఆర్ట్స్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏడీసెట్)-23 కమిటీ చైర్మన్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, సెట్ కన్వీనర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథరెడ్డి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఏడీసెట్-23కి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ప్రవేశాలు కల్పిస్తామని వారు ఈ సందర్భంగా ప్రకటించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులతో వీసీ, రిజిస్ట్రార్‌లు నేరుగా మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొందరు ధ్రువీకరణపత్రాలు తీసుకురాకపోవడంతో వారికి మరికొంత సమయం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రవేశాల పొందిన విద్యార్థులకు వీసీ, రిజిస్ట్రార్‌లు ప్రవేశాల పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రవేశాల కమిటీ ప్రతినిధులు వైవీయూ సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, ఆచార్య ఎ. చంద్రశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు తగిన ఉపాధి కల్పించేలా తోడ్పాటు అందిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

అభివృద్ధిబాట.. అదే నా మాట





రాజీవ్ మార్గ్ ప్రారంభోత్సవం సందర్భంగా వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రాజీవ్‌పార్కులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- కొప్పర్తిలో అల్ డిక్సన్ ఉత్పత్తి ప్రారంభం
- గండికోటలోనూ ఒబెరాయ్ హోటల్‌కు శంకుస్థాపన
- పులివెందులలో మున్సిపల్ భవనం, సిటీ ఫారెస్టు, రివర్ ఫ్రంట్‌తో కొత్త శోభ
- కడపలో రాజీవ్‌మార్గ్, పార్కులతో వెలుగులు
- ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మమేకం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటన విజయవంతం



కొప్పర్తి పారిశ్రామిక వాడలో డిక్సన్ కంపెనీని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

సాక్షి కడప : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధికి పెద్దపీట వేస్తోంది. పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలను పరిశ్రమలు పెట్టేలా పారిశ్రామిక రాయితీలను అందిస్తూ ప్రోత్సహించడంతోపాటు యువతకు ఉపాధి కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో అన్ని వర్గాల ప్రజలకు సువర్ణ పాలన అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. ఒకవైపు యువతకు అవకాశాలు వచ్చేలా పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకురావడం...మరోవైపు పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరచడం.. ఇంకోవైపు ప్రజల బాగోగులు చూసుకుంటూ ముఖ్యమంత్రి పేద ప్రజల గుండెల్లో ప్రత్యేక ముద్ర వేసుకుంటున్నారు. జిల్లాలో పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పెద్ద పెద్ద ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో బిజీబిజీగా గడిపారు. ఈనెల 8వ తేదీన మొదటిరోజు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని నేరుగా ఇడుపులపాయకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతిరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అప్పటి నుంచి మూడు రోజులపాటు తీరిక లేకుండా ప్రజలతో మమేకమవుతూ ముందుకు కదిలారు.

డిక్సన్‌కు ప్రారంభోత్సవం... ఒబెరాయ్ హోటల్‌కు శంకుస్థాపన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతి నుంచి ఇప్పటివరకు స్టీల్‌ప్లాంటు మొదలుకొని అనేక రకాల పరిశ్రమలను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్ తాజాగా పెద్ద పెద్ద పరిశ్రమల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆయన చేతుల మీదుగా గతేడాది శంకుస్థాపన చేసిన ఎలక్ట్రానిక్ రంగంలో పేరొందిన అల్ డిక్సన్ సంస్థ పెద్ద ఎత్తున ఉత్పత్తులను ప్రారంభించింది. ముఖ్యమంత్రి స్వయంగా ఉత్పత్తిని ప్రారంభించడంతోపాటు సంస్థకు చెందిన ఉద్యోగులతో మాటామంతీ...సీసీ కెమెరాల తయారీని పరిశీలించారు. అంతేకాకుండా మరో రెండు సంస్థల ఉత్పత్తులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరోవైపు పర్యాటకంగా ప్రసిద్ధి చెందుతున్న గండికోటలో ఒబెరాయ్ సంస్థ సెవెన్‌స్టార్ హోటల్‌కు ముఖ్యమంత్రి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. సుమారు రూ. 200 కోట్లతో ఒబెరాయ్ హోటల్‌కు సంబంధించిన పనులను సీఎం చేతుల మీదుగా ప్రారంభిచారు.

పులివెందులకు కొత్త శోభ

రాష్ట్రంతోపాటు పుట్టిన పురిటిగడ్డకు సీఎం వైఎస్ జగన్ రుణం తీర్చుకుంటున్నారు.పులివెందుల ప్రజలు ఆహ్లాదం, ఆనందంగా గడిపేలా సిటీ ఫారెస్టు, రివర్ ఫ్రంట్‌ను తీసుకొచ్చారు. అద్భుత నిర్మాణాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇంకోవైపు నూతన మున్సిపల్ భవనం మొదలుకొని ఏపీ కార్ల్‌లోని న్యూటెక్ బయోసైన్సెస్‌కు నాంది పలికారు. యువకులకు అన్ని విధాలా ఉపయోగపడేలా స్పోర్ట్స్ అకాడమీ, యువతలో నైపుణ్యం పెంపునకు స్కిల్ ట్రెనింగ్ అకాడమీలతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

కడపకు ప్రత్యేక ఆకర్షణగా రాజీవ్ మార్గ్

జిల్లా కేంద్రమైన కడపలో రాజీవ్‌మార్గ్ మరో కలికితురాయిగా కనిపిస్తోంది. ఇప్పటికే మహావీర్ సర్కిల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి ప్రస్తుతం అన్ని విధాలా తీర్చిదిద్దిన రాజీవ్ మార్గ్‌ను ప్రారంభించారు. కడప నగర ప్రజలకు సంబంధించి రూపొందించిన రాజీవ్‌పార్కు ఆకట్టుకుంటోంది. తాజాగా రూ. 871.77 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో మమేకమయ్యారు. తొలిరోజు సింహాద్రిపుర మండల నాయకులు, కార్యకర్తలను పలుకరించిన ఆయన అన్నిచోట్ల హెలిప్యాడ్ అభివృద్ధి పనుల ప్రత్యేకంగా అందరిని కలుస్తూ కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు.ఇలా మూడు రోజులపాటు జిల్లాలో బిజీబిజీగా గడిపిన ముఖ్యమంత్రి తన పర్యటన విజయవంతంగా ముగించుకుని సోమవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

సీఎం వెంట విమానంలో వెళ్లిన ఎమ్మెల్యేలు

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంట ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాదరెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డిలు సోమవారం ప్రత్యేక విమానంలో విజయవాడకు వెళ్లారు. రాత్రికి ఇద్దరు ప్రొద్దుటూరులోని తమ నివాసాలకు చేరుకున్నారు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు జేసీ ఆదేశం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : ప్రజల్లో సంతృప్తిస్థాయిని పెంచే విధంగా 'స్పందన'.. 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు పరిష్కారం ఉండాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యకైనా నిర్దేశిత గడువులోగా పరిష్కారం ఉండాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టిపరిస్థితిలో పెండింగ్‌లో ఉండకూడదని, వచ్చింది వచ్చినట్లు ఏ రోజు కారోజు పరిష్కరించాలన్నారు.

ఇవీ వినతులు..

కలికిరి మండలం, చీకటిపల్లి గ్రామానికి చెందిన సి జ్యోతి సర్వే నంబరు. 203ఏలో ఉన్న 1.90 ఎకరాలకు సంబంధించి భూమి హద్దులు చూపించాలని వినతిపత్రం అందజేశారు. రాయచోటి పట్టణానికి చెందిన ఎస్ సుధాకర్ తాను అద్దె ఇంట్లో ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని, తన ఆధార్ నంబర్‌కు ఇతర ఇళ్ల విద్యుత్ మీటర్ లింక్ చేశారని, కావున తన ఆధార్ నంబర్‌కు లింక్ చేసిన విద్యుత్ మీటర్లను తొలగించాలని జేసికి విన్నవించారు. గాలివీడు మండలం, గోరాన్ చెరువుకు చెందిన కె మల్ రెడ్డి సర్వే నంబరు. 1969/2లో 0.17 సెంట్లు భూమికి సంబంధించి తన పేరిట ఆన్‌లైన్ చేసి పాస్ బుక్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అలాగే తంబళ్లపల్లికి చెందిన అమర్నాథరెడ్డి తన నాన్నపేరిట ఉన్న భూమిని తన అన్నదమ్ములు సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్ చేసుకున్నారని, తనకు న్యాయం చేయాలని స్పందన ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.

పవన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు



పీలేరు : పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న గ్రామవలంటీర్లు

రాయచోటి : పవన్ కల్యాణ్ తమపట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలపై వ్యాఖ్యలపై జిల్లాలోని గ్రామ, వార్డు వాలంటీర్లు భగ్గుమన్నారు. రాయచోటి, పీలేరు, కురబలకోట, రామసముద్రం తదితర ప్రాంతాల్లో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేకనే తమపై నిందలు వేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు సేవలు అందిస్తుంటే ఓర్వలేక తమను గూఢచారులు, దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందివ్వడమే కాకుండా ప్రజల కష్టసుఖాలలో భాగస్వాములమై నీతినిజాయితీతో సేవలు అందిస్తున్నామన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలు, వర్గాలను చూడకుండా అర్హతే ఆధారంగా పథకాలను పారదర్శకంగా జగనన్న అందిస్తున్నారని చెప్పారు. పవన్ కల్యాణ్ వెంటనే తమకు బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే మరింత ఉధృతంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వలంటీర్లు హెచ్చరించారు. వాలంటీర్లు చేపట్టిన నిరసనలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రజా సంఘాలు, నాయకులు మద్దతు పలికారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రొద్దుటూరు : ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న పవన్ కళ్యాణ్ వలంటీర్లను కించపరిచే విధంగా మాట్లాడటం తగదని వీరపునాయునిపల్లె జెడ్పీటీసీ రాజేశ్వరి, ఏపీపీఎస్‌సీ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి అన్నారు. పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ వారు సోమవారం వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, వలంటీర్లు కేవలం గౌరవ వేతనం అందుకుంటూ ప్రజలకు సేవలందిస్తుంటే వారిపై జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అసత్య ఆరోపణలు చేయడం తగదని రాయలసీమ పోలీసు కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగోశేషారెడ్డి అన్నారు.

రిమ్స్‌లో అధునాతన వైద్యసేవలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్న ఎల్లో మీడియా రోజురోజుకు పేట్రేగిపోతోంది. ఉచితానుచితాలను పాటించకుండా, పాత్రికేయ ప్రమాణాలు పట్టించుకోకుండా తన పచ్చ పైత్యాన్ని చూపిస్తోంది.రిమ్స్‌లో వైద్యసేవలు సమృద్ధిగా ఉన్నా..అధునాతన సౌకర్యాలతో అన్ని విభాగల్లో పడకలు ఉన్నా..ప్రతిరోజు వైద్యాధికారుల పర్యవేక్షణలో రోగులకు సేవలు అందుతున్నా ఆక్సిజన్ ఫ్లో మీటర్లు పని చేయడంలేదంటూ అక్షరాల్లో తన కడుపుమంటను బయట పెట్టుకుంటోంది.

ఫ్యాక్ట్ చెక్

- అన్ని విభాగాల్లో పడకలు
- ప్రతి యూనిట్‌లో అవసరమైన చోట ఆక్సీఫ్లోమీటర్
- అన్ని వేళలా అందుబాటులో ఆక్సిజన్



రిమ్స్‌లోని మహిళల మెడికల్ వార్డులో వున్న ఆక్సీఫ్లోమీటర్



కడప రిమ్స్ ఆవరణలో ఆక్సిజన్ ప్లాంట్స్

కడప అర్బన్ : కడప లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు అధునాతన సౌకర్యాలను కలిగి ఉన్నాయి. ఐపీ విభాగంలోని ఒక్కో ఫ్లోర్‌లో వివిధ విభాగాలకు సంబంధించి పడకల వారీగా ఆక్సీఫ్లో మీటర్‌లు ఉన్నాయి.

- ఐపీ విభాగంలో ఆక్సిజన్ సౌకర్యం కలిగిన వార్డుల్లో కార్డియాలజీ, ఆపరేషన్ థియేటర్, అత్యవసర ఆపరేషన్ థియేటర్, మెడికల్, సర్జికల్, గైనిక్, ఎస్ఎన్‌సీయూ, పీడియాట్రిక్ ఐసీయూ, మెడికల్ వార్డ్స్, టి.బి వార్డులు ఉన్నాయి. ఐపీ విభాగంలో మొత్తం నాలుగు ఫ్లోర్లలో 617 పడకలుంటే ప్రతి పడకకు ఆక్సీఫ్లోమీటర్ ఉంది. బి-టైప్ సిలెండర్స్ 41, బల్క్‌టైప్ సిలిండర్స్ 70, వెంటిలేటర్స్ 231, వెంటిలేటర్స్ కలిగిన పడకలు 156 ఉన్నాయి.
- రిమ్స్ ఆసుపత్రిలో ప్రతి రోజూ ఓపి విభాగంలో 1400 నుంచి 1800 వరకు పేషెంట్లు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు.
- ఐపీ విభాగంలో ఈనెల 9వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10 తేదీ ఉదయం 9 గంటల వరకు 623 మంది ఐపీ విభాగంలో సేవలను పొందారు. 63 మంది వివిధ విభాగాల్లో వైద్య సేవలను పొందేందుకు అడ్మిట్ అయ్యారు.
- ప్రస్తుతం గైనిక్‌లో 195 మంది, ఎస్ఎన్‌సీయూలో 38 మంది, పీడియాట్రిక్ (ఎన్ఆర్‌సీ)లో 27 మంది, మెడికల్ వార్డ్స్‌లలో 96, సర్జికల్‌లో 97, టి.బి వార్డులో 15, ఆర్థోపెడిక్స్‌లో 48, ఈఎన్‌టీలో 19 మంది వైద్య సేవలను అందుకుంటున్నారు.

రిమ్స్‌లో మెండుగా ఆక్సిజన్ ప్లాంట్స్...

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణంలో పీఎస్ఏ (లిక్విడ్) ఆక్సిజన్ ప్లాంట్స్ వెయ్యి లీటర్ల చొప్పున రెండు ప్లాంట్స్ అందుబాటులో ఉన్నాయి. 'జగనన్న ప్రాణ వాయువు' విధానంలో వెయ్యిలీటర్ల చొప్పున రెండు ప్లాంట్స్, 500 లీటర్ల చొప్పున మూడు ప్లాంట్స్, 70 బల్క్ సిలెండర్స్, దాదాపు 500 కాన్సన్ట్రేట్ ఆక్సిజన్ సిలెండర్స్ అందుబాటులో ఉన్నాయి.

ఎలాంటి అసౌకర్యం లేదు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆక్సిజన్ వల్ల ఎలాంటి అసౌకర్యం లేదు. అన్ని వేళలా అందుబాటులో ఉంది. ఎవరూ అపోహలు పడాల్సిన అవసరం లేదు. నిరంతరం వైద్య సౌకర్యాలపై పర్యవేక్షిస్తుంటాం. – డాక్టర్ వై. శ్రీనివాసులు, కడప రిమ్స్ ఆర్ఎంఓ



కనిపించలేదా..నిర్మాణ పనులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొనరాజుపల్లిలో అప్రోచ్ రోడ్డు పనులు జరగుతున్నాయి. ఈనెల 7న ఈనాడు పత్రికలో 'కంకర తేలిన దారి...రాకపోకలెలా మరి?' శీర్షికతో నిర్మాణంలో ఉన్న అప్రోచ్ రోడ్డుపై కథనం ప్రచురించారు. వాస్తవానికి ఆ రోడ్డు పనులకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 2018లో టెండర్లు వేశారు. 2019 జనవరి నెలలో అగ్రిమెంట్ అయింది. ఆ టైంలో బిల్లులు అందడం లేదని అప్పట్లో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాలేదు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొనరాజుపల్లి సర్పంచ్ శేఖర్‌రెడ్డి అప్రోజ్ రోడ్డు సమస్యను రాజంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఎమ్మెల్యే రోడ్డుకు సంబంధించి మెగా కంపెనీ వారిని పనులు చేయమని అడిగారు. వారు మెగా కంపెనీ సబ్ కంట్రాక్టర్లకు కాంట్రాక్ట్ అప్పజెప్పారు. మూడు వారాల కిందట కొనరాజుపల్లి అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా రోడ్డుకు సంబంధించి క్వాలిటీ చెకప్ కూడా పూర్తయింది. అంతే కాకుండా రోడ్డు నిర్మాణం ప్రారంభించేందుకు 740 మీటర్ల పొడవున కంకర, సిమెంట్ కూడా తోలారు. ఇంతలోనే ప్రభుత్వంపై బురద చల్లేలా అసత్య కథనాలు 'ఈనాడు'లో కనిపిస్తున్నాయి. ఈ అప్రోచ్ రోడ్డు విస్తీర్ణత 740 మీటర్లు, విలువ రూ. 63.33 లక్షలు.



నిర్మాణంలో ఉన్న కొనరాజుపల్లి అప్రోచ్ రోడ్డు

క్లుప్తంగా

శభాష్ వలంటీర్



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రాజంపేట : తప్పిపోయిన బాలుడిని వలంటీర్ తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వైఎస్ఆర్ జిల్లా అట్లూరు మండలం మాడపూరు గ్రామానికి చెందిన బాలరాజు నాగరాజు, ఆదిలక్ష్మి, కుమారుడు కుశాల్‌తోపాటు సోమవారం అన్నమయ్య జిల్లా రాజంపేటకు వచ్చారు. అక్కడ హైదర్‌నగర్‌లోని నాగరాజు అత్తారింటికి చేరుకున్నారు. కుమారుడు కుశాల్ ఆడుకుంటూ బయటకు వచ్చి కనిపించకుండా పోయాడు. సంబంధీకులు గాలింపు చేశారు. ఫలితం లేకపోయింది. దీంతో పట్టణ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డికి తెలియజేశారు. ఆయన వెంటనే వలంటీర్, మీడియా గ్రూపుల ద్వారా సమాచారాన్ని ప్రజల్లోకి చేరవేశారు. దీంతో నూనెవారిపల్లి వలంటీర్ హరీష్ ద్వారా బాలుడి సమాచారం తెలిసింది. ఆ బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వర్మ, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో అగ్ని ప్రమాదం

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(ఆర్టీపీపీ)లోని స్టేజ్–2లో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. యూనిట్ కంట్రోల్ బో ర్డులో స్విచ్ మర్జీల్ చేస్తుండగా ఎల్‌టీ సప్లయ్‌లో ప్లాష్ ఓవర్ అయి మంటలు వ్యాపించా యి. అక్కడే పనులు చేస్తున్న ఏఈ పుష్పలత, కాంట్రాక్ట్ కార్మికుడు లక్ష్మీనారాయణరెడ్డికి గాయాలు అయ్యాయి. వారిని వెంటనే ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.





కడపలో రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కు వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో జనం కేరింతలు



కడప రాజీవ్ పార్కులో ప్రజాప్రతినిధులు, అధికారులతో..

అఖండ అభిమానం



రాజీవ్ పార్కులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ



చిన్నారికి ఆత్మీయ ముద్దు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జనం అఖండ అభిమానం చూపారు. సీఎం జిందాబాద్.. జై జగన్.. అనే నినాదాలను పెద్ద ఎత్తున చేశారు. సీఎం పర్యటన జిల్లాలో మూడో రోజైన సోమవారం కడప, కొప్పర్తి పారిశ్రామిక వాడలో జోరుగా హుషారుగా సాగింది. అడుగడుగునా అభిమానుల కేరింతలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. సీఎంను దగ్గరి నుంచి చూశామనే ఆనందంతో ఉద్వేగ భరితులయ్యారు. అలాగే సీఎం జగన్ కొందరిని పలకరించడంతో.. వారు పులకించిపోయారు.





కొప్పర్తి పారిశ్రామికవాడ అల్ డిక్సన్ కంపెనీలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అల్ డిక్సన్ కంపెనీలో పరికరాల తయారీపై తెలుసుకుంటూ..



కడప సుందరీకరణ పనుల ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తూ..

చికిత్స పొందుతూ..

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం కొత్తరోడ్డు నారాయణపురం సమీపంలో ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదంలో గువ్వలచెరువుకు చెందిన సయ్యద్ మహబూబ్ జాన్(47)కు తీవ్ర గాయాలు కాగా తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

పీలేరులో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు అనుమతి



పీలేరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకటసుబ్బారావు

పీలేరు : పీలేరు రైల్వేస్టేషన్‌లో కొత్తగా ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు ఉత్తర్వులు అందినట్లు స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటసుబ్బారావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబరు 07095 సోమ, మంగళ, గురు, శనివారం ధర్మవరం వెళ్లేందుకు తెల్లవారుజామున 5.03 గంటలకు పీలేరు చేరుకుంటుందని తెలిపారు. మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబరు 07096 సోమ, మంగళ, గురు, శనివారం సాయంత్రం 6.14కి పీలేరు స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు.

నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబరు 16339 బుధ, గురు, శుక్ర, ఆదివారం సాయంత్రం 3.14కి పీలేరు చేరుకుంటుందని చెప్పారు. మధురై వెళ్లడానికి ఈ ట్రైన్ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముంబై ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబరు 16340 సోమ, మంగళ, బుధ, శుక్రవారం రాత్రి 10.04కి పీలేరు చేరుకుటుందని తెలిపారు. మధురై ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబరు 22715 ప్రతి శనివారం సాయంత్రం 4.09కు పీలేరుకు వస్తుందన్నారు. కాచిగూడ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నంబరు 22716 ప్రతి సోమవారం తెల్లవారుజామున 1.00 గంటలకు పీలేరులో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కొత్తగా స్టాపింగ్‌కు అనుమతి లభించిన రైళ్లు 1 నిమిషం నుంచి 2 నిమిషాలు ఆగుతాయని తెలిపారు. గుంతకల్లు డీఆర్ఎం కె.వెంకటరమణారెడ్డికి పలువురు వినతిపత్రాలు ఇవ్వడంతో ఆయన కృషితో పలు రైళ్లకు స్టాపింగ్ లభించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా పీలేరు ప్రజలు, ప్రయాణికుల కోరిక మేరకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో ప్రయాణికులు, పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూ వివాదంలో 16 మందిపై కేసులు



గాయపడిన చిన్నరెడ్డెప్ప

బి.కొత్తకోట : భూ వివాదంపై సోమవారం జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడగా, ఇరు వర్గాలకు చెందిన 16 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ రామమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్‌కు చెందిన ఓ భూమికి సంబంధించి దాయాదులైన టి.నారాయణ, చెన్నకేశవ కుటుంబాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ విషయం కోర్టులో ఉండగా ఆదివారం రాత్రి నారాయణ ఆ భూమిలో సాగుకు ప్రయత్నించగా చెన్నకేశవ వర్గీయులు అడ్డుకునేందుకు వెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఓ వర్గానికి చెందిన చిన్నరెడ్డెప్ప, మరో వర్గానికి చెందిన నారాయణ, సుధాకర్, కృష్ణమూర్తి గాయపడ్డారు. వారిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. రెండు వర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాయి. నారాయణ ఫిర్యాదు మేరకు 8 మందిపైన, చిన్నరెడ్డెప్ప ఫిర్యాదు మేరకు 8 మందిపైన కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

టిప్పర్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన అమరనాథరెడ్డి

మదనపల్లె : టిప్పర్‌పై నుంచి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోళ్లపల్లె పంచాయతీ తోకలపల్లె గ్రామానికి చెందిన రైతు పి.అమరనాథరెడ్డి(40) పొలంలో టిప్పర్ యంత్రంతో చదును చేస్తున్నాడు. పనుల్లో భాగంగా టిప్పర్ డోర్ తెరిచే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఆ సమయంలో రాతిపై పడి తలకు తీవ్ర గాయం అయింది. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్సలు అందించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

రామసముద్రం : మండల పరిధి చెంబకూరు సమీపంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లెకి చెందిన అఫ్సర్, జమీర్, సయ్యద్‌బాషా అల్పేపల్లెకు వచ్చి తిరుగు ప్రయాణంలో మలుపు వద్ద వారు వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో అఫ్సర్(25)కు తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి అఫ్సర్‌ను రామసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు రెఫర్ చేశారు.

గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



శ్రీజ సభ్యులకు రూ.10 కోట్ల బోనస్ చెక్ అందజేస్తున్న ఆ సంస్థ నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పుదుచ్చేరి రాష్ట్ర మాజీ గవర్నర్ కిరణ్‌బేడి తెలిపారు. ప్రధానంగా పాడి రంగంలో చిన్నపాటి ఆర్థిక ఆర్జన చేస్తున్న మహిళలను ప్రోత్సహిస్తూ వారి చైతన్యానికి శ్రీజ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కరకంబాడి రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో శ్రీజ సంస్థ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ నుంచి కిరణ్‌బేడి వర్చువల్ విధానంలో శ్రీజ సంస్థ సభ్యులు, అతిథులతో ముచ్చటించారు. దేశంలోని పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి శ్రీజ వంటి సంస్థలను నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అతిథిగా విచ్చేసిన అమర హాస్పిటల్స్ ఎండీ గొర్నసేని రమాదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఇంతగా ప్రోత్సాహకాలు అందించి ఆర్థిక చైతన్యవంతుల్ని చేస్తున్న శ్రీజ సంస్థ కృషి అభినందనీయమన్నారు. మహిళల అభివృద్ధికి దోహదపడుతున్న శ్రీజ సంస్థ వారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. శ్రీజ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ జయతీర్థాచారి మాట్లాడుతూ 10వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీజ సభ్యులకు రూ.10 కోట్ల బోనస్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో నగదు బదిలీ చేయడంతోపాటు అర్హులైన వారికి స్టీలు పాల క్యాన్లు అందించామని తెలిపారు. నెలలో రెండు సార్లు శ్రీజ సంస్థ సభ్యులకు నగదు చెల్లింపులు చేస్తున్నామని, ఇప్పటి వరకు రూ.3,600 కోట్లు వారి ఖాతాలకు జమచేసినట్లు వెల్లడించారు. శ్రీజ కంపెనీ అత్యుత్తమ విజయాలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన సెక్స్ సార్టెడ్ సెమెన్ ప్రాజెక్టును రాయలసీమ ప్రాంతంలో అమలు చేసే ఏజెన్సీగా రాష్ట్రీయ గోకుల్ సేవా మిషన్ కింద ఎంపికైందన్నారు. ఈ ప్రాజెక్టు ఆగస్టు 15వ తేదీ ప్రాంభించనున్నట్లు తెలిపారు. టీఐఎస్ఎస్ మాజీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీలింగం, గ్రాన్యూల్స్ ఇండియా గ్లోబల్ సీహెచ్ఆర్‌వో ఉమారావు, చిత్తూరు, తిరుపతి జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు, డీఎంకే తులసి, జ్యోతి, శ్రీజ సంస్థ చైర్మన్ కె.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి భార్య, భర్తకు గాయాలు



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకొస్తున్న సీఐ లింగప్ప

రాయచోటి టౌన్ : రాయచోటి – మదనపల్లె రోడ్డులోని గొర్లమొదివీడు రోడ్డు క్రాస్ వద్ద సోమవారం బైక్ అదుపు తప్పి కింద పడటంతో భార్య,భర్తకు గాయాలయ్యాయి. మదనపల్లెకు చెందిన జగన్నాథం, ఆయన భార్య ఈశ్వరమ్మ రాయచోటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అదే సమయంలో ఆ దారిలో వస్తున్న రూరల్ సీఐ లింగప్ప వెంటనే స్పందించి వారిని తన కారులో ఆస్పత్రికి తరలించారు. గాయాలు స్వల్పం కావడంతో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లారు. సీఐని పలువురు అభినందించారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె : నందలూరు మండలం గుండ్లూరుకు చెందిన నాగేంద్ర(40) రైల్వేకోడూరు నుంచి స్వగ్రామానికి ఆదివారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతను కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.